సాక్షి సిద్దిపేట

గురువారం । 24 । ఆగస్టు । 2023


మెదక్‌లో నూతన కలెక్టరేట్ భవనాన్ని ప్రారంభిస్తున్న సీఎం కేసీఆర్, చిత్రంలో మంత్రి హరీశ్‌రావు, ఎమ్మెల్యేలు తదితరులు


సభకు హాజరైన ప్రజలు


మాట్లాడుతున్న సీఎం కేసీఆర్

మెతుకుసీమను మెరిపిస్తా

- మెదక్ పట్టణం చుట్టూ రింగ్‌రోడ్డు..
- రామాయంపేట ఇక రెవెన్యూ డివిజన్
- కౌడిపల్లి, రామాయంపేటలో డిగ్రీ కళాశాలలు
- టూరిజం అభివృద్ధికి రూ.100 కోట్లు
- మున్సిపాలిటీలకు రూ.125 కోట్లు..
- ప్రగతి శంఖారావంలో ముఖ్యమంత్రి కేసీఆర్ వరాల జల్లు

అభివృద్ధిలో జిల్లాను ఆదర్శంగా తీర్చిదిద్దుతా

మెదక్: అభివృద్ధిలో మెదక్ జిల్లాను ఆదర్శంగా తీర్చిదిద్దుతా.. పట్టణం చుట్టూ రింగ్‌రోడ్డు నిర్మిస్తాం .. రామాయంపేటను రెవెన్యూ డివిజన్‌గా మారుస్తాం.. కౌడిపల్లి, రామాయంపేటలో డిగ్రీకళాశాలలు ఏర్పాటు చేస్తాం.. టూరిజం అభివృద్ధికి రూ.100 కోట్లతో పాటు పలు వరాలు కురిపించారు సీఎం కేసీఆర్. జిల్లా కేంద్రంలో బుధవారం నిర్వహించిన ప్రగతి శంఖారావం సభకు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ముందుగా బీఆర్‌ఎస్ పార్టీ, ఎస్పీ, సమీకృత కలెక్టరేట్ భవనాలను సీఎం ప్రారంభించారు. అనంతరం జరిగిన బహిరంగ సభలో సీఎం మాట్లాడారు. జిల్లాను అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తామన్నారు. మెదక్ పట్టణం చుట్టూ రింగ్‌రోడ్డు ఏర్పాటు చేసి ట్రాఫిక్ సమస్యను తీరుస్తామన్నారు. రామాయంపేటను రెవెన్యూ డివిజన్ చేస్తానని, కౌడిపల్లికి, రామాయంపేటకు డిగ్రీకళాశాలలను మంజూరు చేస్తామని కేసీఆర్ హామీ ఇచ్చారు. ఏడుపాయల వనదుర్గామాత ఆలయం, పోచారం అభయారణ్యం, పోచారం ప్రాజెక్టు, మెదక్ ఖిల్లా, ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన మెదక్ చర్చి, కొల్చారం మండల కేంద్రంలోని జైనమందిరం తదితర ప్రదేశాల అభివృద్ధికి రూ.100 కోట్లు మంజూరు చేస్తున్నట్లు వెల్లడించారు. అలాగే మెదక్ మున్సిపాలిటీకి రూ.50 కోట్లు, రామాయంపేట, నర్సాపూర్, తూప్రాన్ మున్సిపాలిటీలకు రూ.25 కోట్ల చొప్పున రూ.125 కోట్లను మంజూరు చేస్తున్నామన్నారు. కాంగ్రెస్ వాళ్లు ధరణిని తీసి వేద్దామంటున్నారు. మీరేమంటారని సీఎం ప్రశ్నించడంతో వద్దూ వద్దూ అంటు పెద్ద ఎత్తున నినాదాలు చేశారు.


బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయం ప్రారంభోత్సవం సందర్భంగా నేతలతో సీఎం కేసీఆర్



పద్మా నా బిడ్డ..

ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి నా కూతురు లాంటిదని సీఎం కేసీఆర్ అన్నారు. ఎమ్మెల్యే విన్నవించిన సమస్యలన్నీ పరిష్కరిస్తామని, ప్రగతిలో మెదక్ జిల్లాను మెరిపిస్తామన్నారు. మరి మీరు మాత్రం గతంలో కన్నా అధిక మెజార్టీతో పద్మా దేవేందర్‌రెడ్డిని గెలిపించాలని ప్రజలను కోరారు. దీంతో సభ ప్రాంగణమంతా హర్షధ్వానాలతో మారుమోగింది.

ప్రజల ముంగిటకే పాలన


మాట్లాడుతున్న మంత్రి హరీశ్‌రావు

వైద్యారోగ్య, ఆర్థికశాఖ మంత్రి హరీశ్‌రావు మాట్లాడుతూ తెలంగాణ సాధించగానే సీఎం కేసీఆర్ మెదక్‌ను జిల్లాను ఏర్పాటు చేశారన్నారు. ఎన్నో ఏళ్లుగా నెరవేరని కల కేసీఆర్ వల్ల సాధ్యమైందన్నారు. ఆనాడు కాంగ్రెస్ పాలనలో ఏదైనా పని అవసరమైతే సంగారెడ్డికి వెళ్లాల్సి వచ్చేదని, నేడు ముంగిట్లోకే పాలన వచ్చిందని మంత్రి అన్నారు. మెదక్ జిల్లాకు రాష్ట్రవాటా చెల్లించి రైలు కోసం సీఎం కేసీఆర్ చేసిన కృషి ఎనలేనిదన్నారు. మంజీర, హల్దీవాగులపై చెక్‌డ్యాంములు నిర్మించడంతోపాటు కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా రామాయంపేట, చిన్నశంకరంపేట తదితర మండలాలకు సాగునీరు వస్తోందన్నారు. మండు వేసవిలో సైతం జిల్లాలో జలాశయాలు మత్తడి దూకుతున్నాయని, ఇది సీఎం కేసీఆర్ కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మించడం వల్లేనని అన్నారు. కాంగ్రెస్, బీజేపీలు సీఎంను తిట్లపురాణం చేస్తుంటే కేసీఆర్ మాత్రం పుట్లకొద్దీ ధాన్యం పండిస్తూ రైతుల అభివృద్ధికి కృషి చేస్తున్నారన్నారు. సాగులో దేశంలోనే రాష్ట్రం మొదటి స్థానంలో ఉందన్నారు. ప్రతిపక్షాలు అబద్ధాలతో కాలం గడిపితే కేసీఆర్ మాత్రం అభివృద్ధితో కాలం వెళ్లదీస్తున్నారన్నారు. మెదక్ ఉమ్మడి జిల్లాలో 10కి 10 సీట్లు గెలిపించి సీఎంకు కానుకగా ఇద్దామని చెప్పారు. అనంతరం ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి మాట్లాడుతూ నియోజకవర్గ ప్రజల ఆశీస్సులతో గతంలో కంటే ఈసారి భారీమెజార్టీతో గెలుస్తామన్నారు. కార్యక్రమంలో మంత్రులు మహమూద్‌అలీ, వేముల ప్రశాంత్‌రెడ్డి, ఎంపీలు కొత్త ప్రభాకర్ రెడ్డి, బీబీ పాటిల్, ఎమ్మెల్యేలు మదన్‌రెడ్డి, రసమయి బాలకిషన్, క్రాంతి కిరణ్, భూపాల్ రెడ్డి, ఎమ్మెల్సీ శేరిసుభాష్, హ్యాండ్లూమ్ కార్పొరేషన్ చైర్మన్ చింత ప్రభాకర్, మహిళా కమిషన్ చైర్మన్ సునీతాలక్ష్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

దరఖాస్తుల ఆహ్వానం

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): విదేశాల్లో ఉన్నత విద్యను అభ్యసించేందుకు అంబేద్కర్ ఓవర్సీస్ ఎడ్యుకేషన్ ఫండ్‌కు జిల్లాకు చెందిన ఎస్సీ విద్యార్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా షెడ్యూల్ కులాల అభివృద్ధి శాఖ అధికారి కవిత బుధవారం తెలిపారు. అర్హులైనవారు ఈనెల 23 నుంచి సెప్టెంబర్ 31వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు.

పోస్ట్ మెట్రిక్ స్కాలర్‌షిప్‌లకు..

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): 2023–24 విద్యాసంవత్సరానికి జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థల్లో విద్యనభ్యసిస్తున్న విద్యార్థులు పోస్ట్‌మెట్రిక్ స్కాలర్‌షిప్‌లకు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా షెడ్యూల్ కులాల అభివృద్ధి అధికారి కవిత బుధవారం తెలిపారు. అర్హులైనవారు ఈనెల 23 నుంచి డిసెంబర్ 31వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు.

నాచగిరిలో టెండర్ల వేలంపాట

వర్గల్(గజ్వేల్): వివిధ టెండర్ల వేలం పాట ద్వారా ప్రసిద్ధ పుణ్యక్షేత్రం నాచగిరికి ఆదాయం సమకూరింది. ఆలయ ఈఓ అన్నపూర్ణ, సిద్దిపేట వెంకటేశ్వరాలయ ఈఓ విశ్వనాథశర్మ పర్యవేక్షణలో బుధవారం ఆలయం వద్ద వివిధ హక్కుల కోసం టెండర్ల వేలంపాట నిర్వహించారు. తలనీలాల సేకరణకు రూ. 3,75,000, స్వామి, అమ్మవారికి సమర్పించిన చీరలు, ధోవతుల ప్రోగుచేసుకునేందుకు రూ.3,25,000, ఒడి బియ్యం హక్కుకు రూ.1,40,000, పాదరక్షలు భద్రపరచుటకు రూ. 1,15,000 కలిపి మొత్తం రూ. 9,55,000 వచ్చినట్లు ఈఓ పేర్కొన్నారు. వెండి, రాగి డాలర్లు, అందుకు సంబంధించిన డై, రక్షా బంధనాల కోసం వేలం నిర్వహించినట్లు ఆమె వివరించారు.

కొనసాగుతున్న రక్త పరీక్షలు

సిద్దిపేటకమాన్: జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో జిల్లాలోని 116 రెసిడెన్షియల్ పాఠశాలలు, హాస్టళ్లలోని బాలికలకు హెచ్‌బి పరీక్షలు నిర్వహిస్తున్నట్లు డీఎంహెచ్‌ఓ కాశీనాథ్ తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు ఆదేశాల మేరకు, అడిషనల్ కలెక్టర్ గరిమా అగర్వాల్ సూచనలతో జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలు, వసతి గృహాల్లోని 29,613 మంది బాలికలకుగాను 12,237 మందికి హిమోగ్లోబిన్ స్క్రీనింగ్ పరీక్షలు చేశామన్నారు. మిగిలిన వారికి కూడా పరీక్షలు చేయిస్తామని తెలిపారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ఐరన్ మాత్రలు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు.

మోదీ, కేసీఆర్ డబుల్ ఇంజిన్ నటులు


- ఏఐసీసీ కార్యదర్శి క్రిస్టోఫర్ తిలక్


సమావేశంలో మాట్లాడుతున్న ఏఐసీసీ కార్యదర్శి క్రిస్టోఫర్ తిలక్

హుస్నాబాద్: తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తెచ్చేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని, ఇందుకు కాంగ్రెస్ శ్రేణులు సిద్ధంగా ఉండాలని ఏఐసీసీ కార్యదర్శి, కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ పరిశీలకుడు క్రిస్టోఫర్ తిలక్ అన్నారు. బుధవారం జరిగిన కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశానికి హాజరై మాట్లాడారు. మూడు రోజులుగా కరీంనగర్ పార్లమెంట్ పరిధిలోని పలు నియోజకవర్గాల్లో పర్యటించినట్లు తెలిపారు. అన్ని చోట్ల కాంగ్రెస్ రావాలని ప్రజలు ఎదురుచూస్తున్నారన్నారు. హుస్నాబాద్ ఎమ్మెల్యే సతీష్‌కుమార్ అనేక వాగ్దానాలు చేసి అమలు చేయకపోవడంపట్ల ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఉందన్నారు. ఆయన అసమర్థతవల్లే గౌరవెల్లి ప్రాజెక్టు పూర్తి కాలేదని విమర్శించారు. ఈ వంద రోజులు కార్యకర్తలు గడపగడపకు తిరుగుతూ బీఆర్‌ఎస్ ప్రజా వ్యతిరేక విధానాలు, కాంగ్రెస్ చేసిన అభివృద్ధి, సంక్షేమ పాలనపై ప్రజలకు వివరించాలన్నారు. బీజేపీ, బీఆర్‌ఎస్ ఒక్కటేనని, కేంద్రంలో నరేంద్రమోదీ, రాష్ట్రంలో కేసీఆర్ డబుల్ ఇంజన్ సర్కార్ కోసం నటులుగా వ్యవహరిస్తున్నారని ఎద్దేవా చేశారు. అనంతరం టీపీసీసీ ఉపాధ్యక్షురాలు నేరేళ్ల శారద మాట్లాడుతూ త్యాగాలు చేసిన చరిత్ర ఉన్న కాంగ్రెస్ పార్టీని విమర్శించే నైతిక హక్కు ఎమ్మెల్సీ కవితకు లేదన్నారు. సమావేశంలో కరీంనగర్ పార్లమెంట్ టీ పీసీసీ పరిశీలకులు దొమ్మాటి సాంబయ్య, టీపీసీసీ ఉపాధ్యక్షురాలు నేరేళ్ల శారద, కరీంనగర్ డీసీసీ అధ్యక్షుడు కవ్వంపల్లి సత్యనారాయణ, మాజీ ఎంపీ పొన్నం ప్రభాకర్, మాజీ ఎమ్మెల్యే అల్గిరెడ్డి ప్రవీణ్‌రెడ్డి, టీపీసీసీ సభ్యుడు కేడం లింగమూర్తి, సింగిల్ విండో చైర్మన్ బొలిశెట్టి శివయ్య, డీసీసీ కార్యదర్శి చిత్తారి రవీందర్, రిటైర్డ్ సీఐ దాసరి భూమయ్య, ఏడు మండలాల పార్టీ అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల ఆకస్మిక తనిఖీ

కోహెడరూరల్(హుస్నాబాద్): పెండింగ్ పనులను త్వరగా పూర్తి చేయాలని సిద్దిపేట డీఈఓ శ్రీనివాస్‌రెడ్డి ఆదేశించారు. బుధవారం మండలంలోని ఆరెపల్లె, చంద్రనాయక్ తండా, న్యూనగిరకొమ్ముల, ఓల్డ్ నగిరకొమ్ముల, కూరెల్ల ప్రాథమిక పాఠశాలలను, పరివేదలోని ప్రాథమికోన్నత పాఠశాల, మైసంపెల్లి, శ్రీరాములపల్లి, చెంచెరుచెర్వుపల్లి ప్రాథమిక, ఉన్నత పాఠశాలలను ఆకస్మికంగా సందర్శించారు. విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరు, మధ్యాహ్న భోజన పథకం అమలు తీరును పరిశీలించారు. మన ఊరు–మన బడి పనులను పరిశీలించి త్వరగా పూర్తి చేసేలా చర్యలు చేపట్టాలని హెచ్‌ఎంలకు సూచించారు. చదువులో వెనుకబడ్డ పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. పదో తరగతిలో వంద శాతం ఉత్తీర్ణత సాధించేలా కార్యాచరణ చేపట్టాలన్నారు.


ఎంఈఓ ఆఫీస్‌లో రికార్డులు తనిఖీ చేస్తున్న డీఈఓ

దివ్యాంగులకు ఉచిత ఉపకరణాలు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): సమగ్ర శిక్ష అభియాన్ సిద్దిపేట, అలింకో సంయుక్త ఆధ్వర్యంలో దివ్యాంగుల ఉపకరణాల ఎంపికకు గత సంవత్సరం శిబిరం నిర్వహించినట్లు జిల్లా విద్యాధికారి శ్రీనివాస్‌రెడ్డి బుధవారం తెలిపారు. వీటిని ఈనెల 25వ తేదీన జిల్లా కేంద్రంలోని టీటీసీ భవన్‌లో పంపిణీ చేస్తామన్నారు.

26న కోటి మొక్కలు నాటాలి

- అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్


మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్

సిద్దిపేటరూరల్: ఈనెల 26న రాష్ట్ర వ్యాప్తంగా కోటి మొక్కలు నాటే కార్యక్రమం ఉన్నందున ఏర్పాట్లు చేయాలని గరిమా అగర్వాల్ అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లో ఎంపీడీఓ, ఏపీఓ, ఉద్యానశాఖ, పంచాయతీ రాజ్ ఇంజనీరింగ్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ స్వాతంత్ర్య దినోత్సవ వజ్రోత్సవ ముగింపు వేడుకల సందర్భంగా కోటి మొక్కలు నాటాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. ఈ మేరకు జిల్లాలో 4.72 లక్షల టార్గెట్ నిర్దేశించారని తెలిపారు. జిల్లాలో పండ్ల తోటల పెంపకానికి 2,010 ఎకరాల లక్ష్యానికిగాను ఇప్పటి వరకు 1,543 ఎకరాలు గుర్తించినందుకు ఉద్యాన శాఖ అధికారులను అభినందించారు. నిర్మాణంలో ఉన్న గ్రామపంచాయతీ భవనాలను త్వరగా పూర్తి చేయాలని, పనులు ప్రారంభంకాని చోట్ల వారంలోపు ప్రారంభించడానికి చర్యలు తీసుకోవాలని పంచాయతీ రాజ్ డీఈ, ఏఈలను ఆదేశించారు. నిర్మాణంలో ఉన్న భవనాలు సెప్టెంబర్ రెండో వారంలోపు ప్రారంభానికి సిద్ధం చేసేలా యుద్ధ ప్రాతిపదికన పనులు పూర్తిచేయాలన్నారు. కార్యక్రమంలో డీఆర్డీఏ పీడీ చంద్రమోహన్ రెడ్డి, పంచాయతీ రాజ్ ఈఈ శ్రీనివాస్, డీపీఓ దేవకీదేవి, డీహెచ్‌ఎస్‌ఓ సునీత తదితరులు పాల్గొన్నారు.

ప్రగతిపథంలో పల్లెలు

- జిల్లా పంచాయతీ అధికారి దేవకీ దేవి

రాయపోలు(దుబ్బాక): ప్రభుత్వం చేపట్టిన పల్లె ప్రగతి కార్యక్రమంతో గ్రామాలు ప్రగతి పథంలో సాగుతున్నాయని జిల్లా పంచాయతీ అధికారి దేవకీదేవి అన్నారు. బుధవారం రాయపోలు మండలం అనాజీపూర్, ఆరెపల్లి, రాయపోలు గ్రామాల్లో పర్యటించారు. ఆయా గ్రామాల్లో డంపింగ్ యార్డులు, వైకుంఠధామాలు, నర్సరీలను సందర్శించారు. అనంతరం ఆయా పంచాయతీ కార్యాలయాల్లో రికార్డులను పరిశీలించారు. జూనియర్ పంచాయతీ కార్యదర్శుల పరితీరుపై సమీక్షించారు. వారిని ప్రభుత్వం రెగ్యులర్ చేయనున్న నేపథ్యంలో అధికారి పర్యటన ప్రాధాన్యత సంతరించుకుంది. ఆమెతో పాటు డీఎల్‌పీఓ వేదవతి, ఎంపీడీఓ మునయ్య, ఎంపీఓ లక్ష్మీనారాయణ తదితరులున్నారు.


అనాజీపూర్‌లో నర్సరీని పరిశీలిస్తున్న డీపీఓ

ఓపీఎస్ అమలు చేయాలి

- టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు విజయేందర్‌రెడ్డి

మద్దూరు(హుస్నాబాద్): నూతన పెన్షన్ విధానాన్ని రద్దుచేసి, పాత పెన్షన్ విధానం కొనసాగించాలని టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు విజయేందర్‌రెడ్డి అన్నారు. మద్దూరు, దూల్మిట్ట మండలాలల్లో టీపీటీఎఫ్ సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీఓ 317 బాధితులకు స్థానికత ఆధారంగా పోస్టింగ్ ఇవ్వాలన్నారు. ట్రెజరీలో పెండింగ్‌లో ఉన్న బిల్లులను వెంటనే మంజూరు చేయాలన్నారు. పీఆర్‌సీ కమిటీని నియమించి, మధ్యంతర భృతిని వెంటనే ప్రకటించాలన్నారు. బకాయి డీఏలను వెంటనే విడుదల చేయాలని విజ్ఞప్తి చేశారు. కోర్టులో ఉన్న కేసులను పరిష్కరించి ప్రమోషన్, బదిలీలు వెంటనే చేపట్టాలన్నారు. నూతన టీఆర్టీ రిక్రూట్ అయ్యేలోపు విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా విద్యావలంటీర్లు నియమించాలన్నారు. కార్యక్రమంలో టీపీటీఎఫ్ జిల్లా సాంస్కృతిక విభాగం కన్వీనర్ పబ్బోజు రాజమౌళి, మద్దూరు, దూల్మిట్ట మండలాల అధ్యక్షులు బాల్‌రెడ్డి, గిరి సురేందర్ రెడ్డి, ఈగ ఆంజనేయులు, దాసరి సమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.


సభ్యత్వ నమోదు నిర్వహిస్తున్న నాయకులు

జయహో విక్రమ్


వర్గల్ నవోదయలో చంద్రయాన్–3 ల్యాండింగ్ ఘట్టాన్ని వీక్షిస్తున్న విద్యార్థులు

వర్గల్(గజ్వేల్): జాబిల్లిపై చంద్రయాన్-3 ల్యాండింగ్ ఘట్టాన్ని బుధవారం సాయంత్రం వర్గల్ జవహర్ నవోదయ విద్యార్థులు డిజిటల్ స్క్రీన్‌పై ప్రత్యక్షంగా వీక్షిస్తూ మురిసిపోయారు. ప్రిన్సిపాల్ రాజేందర్, అధ్యాపక బృందం పర్యవేక్షణలో మల్టీపర్పస్ హాల్‌లో విద్యార్థుల కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. చంద్రయాన్-3 ప్రయోగంలో కీలక ఘట్టం చంద్రుడి దక్షిణ ధృవంపై సాఫ్ట్ ల్యాండింగ్‌ను చూస్తూ కేరింతలు కొట్టారు. ల్యాండ్ కాగానే చప్పట్లు కొడుతూ హర్షం వ్యక్తం చేశారు.

క్లుప్తంగా

నిలువెల్లా అభిమానం



ఒంటిపై సీఎం, ఎమ్మెల్యే పెయింటింగ్‌తో అభిమానులు

మెదక్‌మున్సిపాలిటీ: మెదక్‌లో జరిగిన సభలో అభిమానులు తమ ఒంటిపై గులాబీ రంగు పూసుకొని సీఎం కేసీఆర్, మెదక్ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డిల చిత్రపటాలు చిత్రీకరించుకొని ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. సభలో జై కేసీఆర్.. జై పద్మక్క అంటూ నినాదాలు చేస్తూ వారి అభిమానాన్ని చాటుకున్నారు.

ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం ముట్టడికి యత్నం



నాయకులను అడ్డుకుంటున్న పోలీసులు

హుస్నాబాద్: బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేస్తూ బుధవారం బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కోమటిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి, బొమ్మ శ్రీరాంచక్రవర్తి, జన్నపురెడ్డి సురేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయ ముట్టడికి యత్నించారు. మార్కెట్ యార్డు ప్రధాన గేట్ వద్ద వారిని పోలీస్‌లు అడ్డుకున్నారు. ఆందోళనకారులను పోలీస్ స్టేషన్‌కు తరలించారు. కార్యక్రమంలో పార్టీ అసెంబ్లీ కన్వీనర్ లక్ష్మారెడ్డి, పట్టణ అధ్యక్షుడు బత్తుల శంకర్‌బాబు ఉన్నారు.

సీఎం పర్యటనను అడ్డుకునే యత్నం



రాజిరెడ్డిని అరెస్ట్ చేస్తున్న పోలీసులు

కౌడిపల్లి(నర్సాపూర్): మెదక్ పర్యటనకు వస్తున్న సీఎం కేసీఆర్‌ను కౌడిపల్లి వద్ద కాంగ్రెస్ నాయకులు అడ్డుకునే ప్రయత్నం చేశారు. టీపీసీసీ కార్యదర్శి ఆవులు రాజిరెడ్డి ఆధ్వర్యంలో బస్టాండ్ సమీపంలో హైవేపై రాస్తారోకో చేశారు. రోడ్డుపై నుంచి తప్పించే ప్రయత్నంలో ఆందోళనకారులు, పోలీసుల మధ్య తోపులాట జరిగింది. కేసీఆర్ ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా జిల్లాకు ఎందుకువస్తున్నారని రాజిరెడ్డి ప్రశ్నించారు. కార్యక్రమంలో ప్రకాష్, నర్సింహారెడ్డి, మల్లేశ్, రియాజ్, హరీష్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

టేక్మాల్‌లో ఎమ్మెల్యే బైక్‌ర్యాలీ

టేక్మాల్(మెదక్): సీఎం సభకు తరలివెళ్లే ముందు టేక్మాల్‌లో అందోల్ ఎమ్మెల్యే క్రాంతికిరణ్ కార్యకర్తలతో బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా రెండోసారి బీఆర్‌ఎస్ పార్టీ టికెట్ రావడంతో టేక్మాల్ చౌరస్తాలో ఎమ్మెల్యేను కార్యకర్తలు గజమాలతో సత్కరించారు. పెద్దఎత్తున బాణాసంచా కాల్చారు. అనంతరం బస్సులు, కార్లలో ర్యాలీగా మెదక్ సభకు తరలివెళ్లారు. ఈ కార్యక్రమంలో టీఎస్‌ఐడీసీ చైర్మన్ తన్వీర్, డీసీఎంహెచ్ చైర్మన్ శివకుమార్, సీడీసీ డైరెక్టర్ జైపాల్ నాయక్, బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు వీరప్ప, ప్రధాన కార్యదర్శి అవినాష్, నాయకులు భాస్కర్, రవి, సలీమ్, సిద్దయ్య, శ్రీధర్‌రెడ్డి, రమేష్ నాయక్, శ్రీనివాస్ చందు, కిషన్, గణేష్, వసంత్ ఉన్నారు.





సమీకృత కలెక్టరేట్ ఆవరణలో అధికారులతో సీఎం కేసీఆర్

ఫుల్ జోష్

మెదక్ జిల్లాలో ముఖ్యమంత్రి కేసీఆర్ పర్యటన గులాబీ శ్రేణుల్లో జోష్ నింపింది. బుధవారం ఆయన నూతన కలెక్టరేట్, ఎస్పీ, పార్టీ కార్యాలయాలను ప్రారంభించారు. అనంతరం నిర్వహించిన బహిరంగ సభకు ప్రజలు భారీగా తరలివచ్చారు. ఈ సందర్భంగా కేసీఆర్ చేసిన ప్రసంగం అలరించింది. స్వాగత తోరణాలతో పట్టణమంతా గులాబీమయంగా మారింది. మంత్రి హరీశ్‌రావు దగ్గరుండి ఏర్పాట్లను పర్యవేక్షించారు.



పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరిస్తున్న ముఖ్యమంత్రి





సభలో మహిళల ఉత్సాహం



పార్టీ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న కేసీఆర్, మంత్రి హరీశ్‌రావు, ఎమ్మెల్యే, నాయకులు



సీఎంకు నమస్కరిస్తున్న సునీతాలక్ష్మారెడ్డి



టేక్మాల్‌లో బైక్‌ర్యాలీ తీస్తున్న ఎమ్మెల్యే క్రాంతికిరణ్



చెక్కును అందజేస్తున్న ముఖ్యమంత్రి, మంత్రి



పార్టీ జెండాను ఆవిష్కరిస్తున్న అధినేత కేసీఆర్

ఉమ్మడి జిల్లాకు కాళేశ్వరం జలాలు

గుమ్మడిదల టోల్‌గేట్ వద్ద సభలో సీఎం కేసీఆర్

జిన్నారం(పటాన్‌చెరు): కాళేశ్వరం జలాలతో ఉమ్మడి మెదక్ జిల్లాను సస్యశ్యామలం చేస్తామని, మరోసారి బీఆర్‌ఎస్‌ను ఆశీర్వదించి ఘన విజయాన్ని అందించాలని సీఎం కేసీఆర్ ప్రజలను కోరారు. బుధవారం మెదక్‌లో పలు అభివృద్ధి కార్యక్రమాల ప్రారంభోత్సవానికి వెళ్తున్న ఆయన గుమ్మడిదల టోల్‌గేట్ వద్ద ఆగారు. అక్కడ ఏర్పాటు చేసిన సభలో మాట్లాడుతూ గుమ్మడిదల ప్రాంతంలో వ్యవసాయం ఎక్కువగా ఉంటుందని, కాళేశ్వరం జలాలతో ప్రతి ఎకరాను సాగులోకి తీసుకొస్తామన్నారు. మరోసారి బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలను అధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. అనంతరం మెదక్‌కు బయల్దేరి వెళ్లారు.

సీఎంకు ఘన స్వాగతం

సీఎం కేసీఆర్‌కు గుమ్మడిదల టోల్‌గేట్ వద్ద ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో ఘనస్వాగతం పలికారు. ఎమ్మెల్యే పటాన్‌చెరు నుంచి ఓఆర్ఆర్ మీదుగా భారీ కాన్వాయ్‌తో గుమ్మడిదలకు చేరుకున్నారు. అన్నారం, దోమడుగు, బొంతపల్లి, గుమ్మడిదల గ్రామాల్లోని ప్రధాన రహదారిపై భారీగా స్వాగత ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. బోనాలు, గుర్రాల స్వారీలు, పోతరాజుల విన్యాసాలు, గంగిరెద్దుల ప్రదర్శనలు, పీర్ల ఊరేగింపు, కోలాటం, ఒగ్గు కళాకారులు, కోయల నృత్యాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. మధ్యాహ్నం 1.40కి కేసీఆర్ గుమ్మడిదలకు చేరుకున్నారు. ఎస్పీ రమణకుమార్ ఆధ్వర్యంలో భారీ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో మంత్రి హరీష్‌రావు, జెడ్పీవైస్ చైర్మన్ మంజు, ఎంపీ కొత్తప్రభాకర్‌రెడ్డి, కలెక్టర్ శరత్, మాజీ ఎమ్మెల్సీ భూపాల్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే సత్యనారాయణ, జెడ్పీవైస్ చైర్మన్ ప్రభాకర్, జెడ్పీటీసీ కుమార్‌గౌడ్, ఎంపీపీ ప్రవీణ, హుస్సేన్ పాల్గొన్నారు.



గుమ్మడిదల టోల్‌గేట్ వద్ద ప్రజలకు అభివాదం చేస్తున్న సీఎం కేసీఆర్



ర్యాలీగా తరలివస్తున్న ఎమ్మెల్యే



కోయ డప్పు వాయిస్తున్న ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

ప్రతిపక్ష నాయకుల ముందస్తు అరెస్టులు

నర్సాపూర్: మెదక్ సీఎం పర్యటన సందర్భంగా నర్సాపూర్ మండలంలోని పలువురు బీజేపీ, కాంగ్రెస్ నాయకులను పోలీసులు ముందస్తుగా అదుపులోకి తీసుకున్నారు. పోలీస్‌స్టేషన్‌లో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, నర్సాపూర్ మున్సిపల్ చైర్మన్ మురళీ యాదవ్ మాట్లాడారు. ఎన్నికలు రాగానే కేసీఆర్ మాయమాటలు చెప్పి ప్రజలను మోసం చేస్తున్నారని ఆరోపించారు. మోసగాడు కాబట్టే పోలీసులను అడ్డుపెట్టుకొని ప్రతిపక్షాలను అరెస్టు చేయిస్తూ పర్యటనకు వస్తున్నాడని విమర్శించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ బడుగు వర్గాలు గజ్వేల్‌లో ఓడిస్తారనే భయంతో కామారెడ్డి నుంచి సైతం పోటీ చేయాలని నిర్ణయించుకున్నారని ఎద్దేవా చేశారు. రెండు సార్లు ఓడిపోయిన చెల్లని రూపాయికి (సునీతారెడ్డిని ఉద్దేశిస్తూ)టికెట్ ఇచ్చినా తమకు అభ్యంతరం లేదని తెలంగాణ పీసీసీ డెలిగేట్ ఆంజనేయులుగౌడ్ అన్నారు. ఎమ్మెల్యే మదన్‌రెడ్డి అవినీతికి పాల్పడ్డాడు కాబట్టే నర్సాపూర్ టికెట్‌ను పెండింగ్‌లో పెట్టారని విమర్శించారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వాన్ని బొంద పెట్టే రోజులు దగ్గరలోనే ఉన్నాయని అన్నారు.



నర్సాపూర్ పోలీసుల అదుపులో ఉన్న నాయకులు

బీఆర్‌ఎస్ నాయకుల అత్యుత్సాహం

నర్సాపూర్: సీఎం కేసీఆర్ పర్యటన సందర్భంగా నర్సాపూర్‌లో కొందరు బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు అత్యుత్సాహం ప్రదర్శించారు. చౌరస్తా వద్దకు సీఎం కాన్వాయ్ రాగానే ఎమ్మెల్యే మదన్‌రెడ్డి, రాష్ట్ర మహిళ కమిషన్ చైర్‌పర్సన్ సునీతారెడ్డి అనుచరులు దూసుకుపోయారు. వారి నాయకులకు అనుకూలంగా నినాదాలు చేస్తూ గందరగోళం సృష్టించారు. పోలీసులు వారిని పక్కకు తప్పించే ప్రయత్నం చేసినా ఎవరూ వెనక్కు తగ్గలేదు. నిషేధం ఉన్నప్పటికీ చౌరస్తా వద్ద డీజే సౌండ్ పెట్టడం కూడా ఇబ్బందికరంగా మారింది.



కేసీఆర్ బస్సు వద్దకు దూసుకుపోయిన బీఆర్‌ఎస్ కార్యకర్తలు

బీఆర్‌ఎస్ పాలనలో విద్యారంగం నిర్వీర్యం

చిన్నకోడూరు(సిద్దిపేట): విద్యా రంగాన్ని బీఆర్‌ఎస్ ప్రభుత్వం నిర్వీర్యం చేస్తుందని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు సంజీవ్ కుమార్ అన్నారు. బుధవారం చిన్నకోడూరు జూనియర్ కళాశాలలో సభ్యత్వ నమోదు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో బోధన బోధనేతర ఖాళీలను వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. పెండింగ్ ఉపకార వేతనాలు వెంటనే విడుదల చేయాలన్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో మధ్యాహ్న భోజనం అమలు చేయాలని కోరారు. అనంతరం ఎస్ఎఫ్ఐ మండల కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఉపేందర్, కార్యదర్శిగా తనుష్, ఉపాధ్యక్షుడిగా భాను, సహాయ కార్యదర్శిగా శివతో పాటు సలహాదారులను ఎన్నుకున్నారు.



మాట్లాడుతున్న సంజీవ్ కుమార్

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



చిన్నశంకరంపేట(మెదక్): టీవీఎస్ ఎక్సెల్‌పై వస్తున్న వ్యక్తిని టిప్పర్ ఢీకొట్టడంతో తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందిన సంఘటన చిన్నశంకరంపేట మండలం కొర్విపల్లి గ్రామ శివారులో బుధవారం చోటుచేసుకుంది. ఎస్ఐ నారాయణ వివరాలు. కామారెడ్డి జిల్లా నాగిరెడ్డిపేట మండల కేంద్రానికి చెందిన మత్తమల సిద్దిరాములు(45) టీవీఎస్ ఎక్సెల్‌పై మెదక్ నుంచి చేగుంట వైపు వస్తుండగా ఎదురుగా వస్తున్న టిప్పర్ ఢీకొట్టింది. తీవ్రగాయాలు కావడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. హైదరాబాద్‌లో నివాసం ఉండే సిద్దిరాములు స్వగ్రామానికి వచ్చి తిరిగివెళ్తుండగా ఈ ప్రమాదం జరిగింది. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీస్‌లు మృతదేహాన్ని మెదక్ ఏరియా ఆస్పత్రికి తరలించారు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తేన్నట్లు ఎస్ఐ తెలిపారు.

జాతీయ జట్టుకు సిద్దిపేట క్రీడాకారిణి

సిద్దిపేటజోన్: సిద్దిపేటకు చెందిన సాఫ్ట్‌బాల్ క్రీడాకారిణి కుమారి పూజకు భారత జట్టులో చోటు లభించింది. ఈనెల 29 నుంచి 31 వరకు చైనాలోని ఫింగ్టస్‌లో జరిగే ఆసియా కప్ సాఫ్ట్‌బాల్ చాంపియన్స్ టోర్నీలో పాల్గొనే భారత మహిళా జట్టుకు పూజ ఎంపికైంది. ఏప్రిల్‌లో తెలంగాణ మహిళా విశ్వ విద్యాలయంలో జరిగిన ఎంపిక ప్రక్రియలో ఉత్తమ ప్రతిభ కనబరిచి జట్టులో స్థానం సాధించింది. ఈసందర్భంగా జాతీయ జట్టులో చోటు దక్కించుకున్న పూజను మంత్రి హరీశ్‌రావు అభినందించారు. బుధవారం అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆమెను సన్మానించారు.

యువకుడి ఆత్మహత్య

వర్గల్(గజ్వేల్): తాగుడుకు బానిసై, జీవితంపై విరక్తితో వర్గల్ మండల కేంద్రంలో బుధవారం రాత్రి ఓ యువకుడు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. గౌరారం పోలీసులు తెలిపిన వివరాలు. వర్గల్‌కు చెందిన బొడిగె ప్రశాంత్‌గౌడ్(28)కు భార్య పూజిత, నాలుగేళ్లలోపు ఇద్దరు పిల్లలు ఉన్నారు. కొంతకాలం నుంచి తాగుడుకు బానిసగా మారాడు. అతని బాధ భరించలేక కొద్దిరోజుల క్రితం భార్య పుట్టింటికి వెళ్లిపోయింది. దీంతో జీవితంపై విరక్తిచెందిన ప్రశాంత్ బుధవారం రాత్రి ఇంటిలో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఘటన స్థలాన్ని గౌరారం పోలీసులు సందర్శించి మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం గజ్వేల్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

సీఎం సభకు వెళ్లి వస్తూ..

వాహనం బోల్తా.. పలువురికి గాయాలు

అల్లాదుర్గం(మెదక్): మెదక్‌లో సీఎం బహిరంగ సభ ముగించుకుని వెళ్తున్న తుఫాన్ వాహనం బోల్తా పడి పలువురికి గాయాలయ్యాయి. ఈ సంఘటన బుధవారం అల్లాదుర్గం మండలం రాంపూర్ గ్రామ శివారులో చోటు చేసుకుంది. నారాయణఖేడ్ ప్రాంతానికి చెందిన వాహనం సీఎం సభకు వెళ్లి తిరిగి వస్తుండగా రాంపూర్ శివారులో ముందు టైర్ పగిలి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ఐదుగురికి స్వల్ప గాయాలయ్యాయి. క్షతగాత్రులను అంబులెన్సులో ఖేడ్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఘటనపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని అల్లాదుర్గం పోలీసులు చెప్పారు.

తెల్లారిన కూలీల బతుకులు

- ఆగి ఉన్న లారీని ఢీకొట్టిన మరో లారీ
- ఇద్దరు మృతి

కొండపాక(గజ్వేల్): లారీ డ్రైవరు నిర్లక్ష్యం, అతివేగం కారణంగా పొట్టకూటి కోసం వలస వచ్చిన కూలీల ప్రాణాలు తెలవారముందుకే గాలిలో కలిశాయి. ఆగి ఉన్న లారీని వెనుక నుంచి మరో లారీ ఢీకొనడంతో ఇద్దరు కూలీలు దుర్మరణం పాలయ్యారు. ఈ సంఘటన కుకునూరుపల్లి మండలంలోని లకుడారం గ్రామ శివారులో బుధవారం తెల్లవారు జామున చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. బీహార్ నుంచి పొట్టకూటి కోసం వలస వచ్చిన కూలీలు మునిప్రసాద్, బీమ్ పస్వాన్ హైదరాబాద్‌లోని బైరామల్‌గూడ కర్మాన్‌ఘాట్‌కు చెందిన కాల్వ రాజేష్ వద్ద పనులు చేస్తున్నారు. ఈ క్రమంలో మంచిర్యాల జిల్లా జమ్మికుంట వద్ద ఉనుక పొట్టును లారీలో లోడ్ చేసుకురావడానికి ఈనెల 22న డ్రైవరు అంజయ్యతో కలిసి వారిద్దరు వెళ్లారు. లోడ్ చేసుకొని తిరిగి నగరానికి వస్తున్న క్రమంలో కుకునూరుపల్లి మండలం లకుడారం గ్రామ శివారులో రిపేర్ నిమిత్తం రోడ్డుపక్కన ఆగి ఉన్న లారీని వెనుక నుంచి వేగంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో లారీ ముందు క్యాబిన్ పూర్తిగా ధ్వంసమైంది. ముందు కూర్చున్న ఇద్దరు కూలీలు క్యాబిన్‌లో ఇరుక్కొని మృతి చెందారు. సమాచారం అందుకున్న పోలీసులు జేసీబీ, గ్యాస్ కట్టర్ సహాయంతో మృత దేహాలను బయటకు తీశారు. పోస్టుమార్టం కోసం గజ్వేల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ట్రాఫిక్ అంతరాయం ఏర్పడటంతో వాహనాలను మరో మార్గంలో పంపించారు. ఈమేరకు లారీ యజమాని రాజేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పుష్పరాజ్ పేర్కొన్నారు.